క్లుప్తంగా

అధికారుల సూచనలు తప్పక పాటించాలి



పాన్‌గల్: రైతులు అధికారుల సూచనలు, సలహాలు తప్పక పాటించాలని ఏఓ సాజీద్ ఉర్ రెహెమాన్ అన్నారు. శనివారం మండలంలోని మల్లాయిపల్లిలో పంట నమోదు వివరాలల్లో భాగంగా రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించి వివరాలను నమోదు చేశారు. ఏఓ మాట్లాడుతూ రైతులు తెగుళ్ల నివారణకు ఇష్టానుసారంగా మందులను పిచికారి చేయవద్దని అధికారులు సూచించిన మేరకు వాడాలన్నారు. ఒకే పంటలను సాగుచేయకుండా ప్రత్యామ్నాయ సాగుపై దృష్టి సారించాలన్నారు. ఆయిల్ ఫామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శైలజ, రైతులు పాల్గొన్నారు.

బదిలీలు, పదోన్నతులు నిర్వహించాలి



పాన్‌గల్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహించాలని టీటీయూ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చింతకుంట, మాందాపూర్‌లో సభ్యత్వ నమోదులో పాల్గొన్నారు. 317 జీఓ బాధితులకు జీరో సర్వీస్ స్టేషన్ పాయింట్లు కల్పించాలని, పండితులు, పీఈటీ పోస్టులను ఉన్నతీకరించి వారికి పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కారించాలన్నారు. సమావేశంలో వెంకటేశ్వర్‌రావు, వెంకటేష్‌యాదవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్లాట్లకు హద్దులు కేటాయిస్తాం



పాన్‌గల్: బీసీ ప్లాట్ల స్థలాన్ని సర్వే పూర్తి చేసి హద్దులు కేటాయిస్తామని తహసీల్దార్ యేసయ్య తెలిపారు. శనివారం మండలంలోని కేతేపల్లి శివారులో సర్వే నంబర్ 627లో బీసీలకు కేటాయించిన 12.30 ఎకరాల భూమిని ఆయన పరిశీలించి సర్వేయర్‌తో సర్వే చేయించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. బీసీలకు ఈ సర్వే నెంబర్‌లో 320 మంది లబ్ధిదారులకు పట్టాలు ఇచ్చారని, వాటి ఆధారంగా సర్వే అనంతరం హద్దులు ఏర్పాటు చేసి కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ చక్రపాణి, ఇన్‌చార్జ్ సర్వే డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ పెన్నయ్య, ఆర్‌ఐ తిరుతపయ్య, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

పనులను త్వరగా పూర్తి చేయాలి



పాన్‌గల్: గ్రామాల్లో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులను నాణ్యతగా చేపడుతూ త్వరగా పూర్తి చేయాలని పీఆర్ ఏఈ సత్తయ్య అన్నారు. శనివారం మండలంలోని ఆకునోనిపల్లెలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించారు. నిర్మాణాల విషయంలో నాణ్యత లోపిస్తే బిల్లులు నిలిపివేస్తామన్నారు. అనంతరం కేతేపల్లి భగత్‌సింగ్ నగర్‌లోని ప్రాథమిక పాఠశాలల్లో మన ఊరు–మన బడి పనులను పరిశీలించారు.

ఆధార్ సీడింగ్‌పై దృష్టి సారించండి



అమరచింత: ఓటు హక్కు కలిగిన వారి ఇళ్లకు వెళ్లి ఓటరు కార్డుకు ఆధార్ సీడింగ్ చేపట్టాలని బీఎల్‌ఓలకు తహసీల్దార్ చాంద్‌పాషా ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మండలంలోని ఆయా గ్రామాల బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఓటరు లిస్టు వివరాలకు ఆధార్ సీడింగ్ కావడం లేదని బీఎల్‌ఓలు వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వారం రోజుల్లోగా పూర్తి స్థాయిలో ఓటు కలిగిన వ్యక్తి ఆధార్‌ను సీడింగ్ చేయాలని సూచించారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం

• స్వామి వారి కల్యాణానికి ఏర్పాట్లు



ఆలయంలో ఉన్న స్వామి వేంకటేశ్వరుడు

కొత్తకోట: మండలంలోని అమడబాకులలో స్వయంభూ కల్యాణ లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. 18రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దారు.

ఉత్సవాల వివరాలు

ఉత్సవాలలో భాగంగా ఉదయాన్నే స్వామి వారిని మేల్కొనడంతో పాటు, ప్రత్యేక పూజలు ప్రారంభమవుతాయి. అందులో భాగంగా ఈ నెల 21, 22, 23 తేదీలలో తిరుమల తిరుపతి దేవస్థాన వేదపండితులైన శ్రీమాన్ కె. పురుషోత్తమాచార్యులు, శ్రీమాన్ ఫణికుమార్, శ్రీమాన్ మధుసుదన్‌శర్మ వారిచే రథ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 24న అకురారోహణము, 26న కల్యాణోత్సవము, 28న హోమం, బలిహరణము, రథోత్సవము, 30న చక్రస్నానము, ఉద్వాసనము, ధ్వజరోహణము నిర్వహించనున్నట్లు ఆలయ ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు వెల్లడించారు. అనంతరం 31 నుంచి ఫిబ్రవరి 8 వరకు ఆలయ ప్రాంగణంలో జాతర నిర్వహిస్తారు.



అమడబాకులలో ఉత్సవాలకు ముస్తాబైన కల్యాణ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం

ఆత్మగౌరవ సభకు భారీగా తరలిరండి



పాన్‌గల్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో నిర్వహించే దళిత, గిరిజన ఆత్మ గౌరవ సభకు మండలం నుంచి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, జిల్లా మహిళా కార్యదర్శి సరోజమ్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలో జన సమీకరణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. దళితులు, గిరిజనులకు ఆత్మ గౌరవ సభపై చైతన్యం చేసి ప్రతి గ్రామం నుంచి భారీగా తరలి వెళ్లే విధంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కృష్ణ, బాలస్వామి, రంజిత్‌కుమార్, స్వామి, నాగేష్‌నాయక్ పాల్గొన్నారు.

గీత కార్మికుల భవనం కోసం వినతి

వీపనగండ్ల: మండల కేంద్రంలో గీత కార్మికులకు కమ్యూనిటీహాల్ నిర్మించుకునేందుకు స్థలాన్ని కేటాయించి, నిధులను మంజూరు చేయించాలని శనివారం గౌడసంఘం నాయకులు సర్పంచ్ నరసింహారెడ్డి, కార్యదర్శి నరేష్‌గౌడ్‌కు శనివారం వినతిపత్రాన్ని సమర్పించారు. సొంత భవనం లేకపోవడంతో మండల కేంద్రానికి వచ్చే గీత కార్మికులు, గౌడసంఘం సభ్యులు ఇబ్బందులకు గురి అవుతున్నారని తెలిపారు. అదేవిధంగా సర్వాయిపాపన్నగౌడ్ విగ్రహ ఏర్పాటుకు కూడా స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో గుండ్రాతి వెంకటయ్య, బసవరాజు, మోహన్‌గౌడ్, వెంకట్‌గౌడ్, శశిధర్‌గౌడ్, వెంకటన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

ఆలయ నిర్మాణానికి సహకరించండి

ఖిల్లాఘనపురం: రజకుల ఆరాధ్యదైవం మాడలయ్య దేవాలయ నిర్మానానికి సహకరించాలని శనివారం రజక సంఘం జిల్లా అధ్యక్షుడు విజయ్ ఆధ్వర్యంలో మండల రజకులు సర్పంచు వెంకటరమణకు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని హన్‌పాడ్ శివారులోని 5, 6 సర్వే నంబర్లలో పూరాతన కాలం నుంచి మాడలయ్య దేవాలయం ఉందన్నారు. ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్నందున పునర్నిర్మాణం కోసం సహకరించాలన్నారు. గతంలో పూజలు నిర్వహించే స్థలంలో ప్రస్తుతం కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రవీందర్, పకీరయ్య, రాములు, బాలస్వామి, కేశవులు, నారాయణ, గణేష్, రాంచంద్రయ్య, సుశీల, శివ, వెంకటేష్ ప్రసాద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

25న అమవీరుల స్మారక వాలీబాల్ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని రామయ్యబౌలీలో ఈనెల 25వ తేదీన తెలంగాణ అమరవీరుల స్మారక జిల్లాస్థాయి వాలీబాల్ టోర్నీ నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ ఎండీ మతీన్‌ఉర్ రహెమాన్ తెలిపారు. శనివారం రామయ్యబౌలీ వాలీబాల్ మైదానంలో వాలీబాల్ టోర్నీ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి ఎంట్రీఫీజు లేదని, టోర్నీలో విజేత జట్టుకు రూ.15వేలు, ద్వితీయ జట్టుకు రూ.10వేలు, మూడోస్థానం జట్టుకు రూ.5వేలు నగదు పారితోషికం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. వివరాల కోసం 9985367313, 9959641632 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి చెన్న వీరయ్య, శరత్‌బాబురెడ్డి, గులాం దస్తగీర్, మహ్మద్ ఖాజా హుస్సేన్, జుబేర్, సయ్యద్ సుల్తాన్, మేరాజ్, అజహర్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్‌లో మంచి ఫలితాలు సాధించాలి



విద్యార్థులకు గైడ్‌లను అందిస్తున్న వర్కటం

అమరచింత: ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు వార్షిక పరీక్షలో మంచి ఫలితాలు సాధించాలని వీజేఆర్ ఫౌండేషన్ చైర్మన్ వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత, బాలికల పాఠశాలలో పదోతరగతి చదువుకుంటున్న విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ గైడ్‌లను శనివారం పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థులకు తమ వంతు సాయంగా గైడ్‌లను ఉచితంగా అందిస్తున్నామన్నారు. తమ సంస్థ ద్వారా 3,500 ఆల్‌ఇన్‌వన్‌లను రూ.14 లక్షలతో తెలుగు మీడియం, ఇంగ్లిష్ మీడియం రూ.6లక్షలతో 1,500 గైడ్‌లను నియోజకవర్గంలోని అందించనున్నామని తెలిపారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు మాట్లాడుతూ బాలికల పాఠశాలలో విద్యార్థులకు మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారని తెలుసుకుని, వాటిని వర్కటం జగన్నాథంరెడ్డి నిర్మించి ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు బలరాముడు, కరుణాకర్ పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన విద్యార్థి



ఆత్మకూర్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పట్టణానికి చెందిన విద్యార్థి ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో మొదటి బహుమతిని సాధించాడని ఎంఈఓ భాస్కర్‌సింగ్, జీహెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి మహేష్ ఇంగ్లిష్ మీడియం విభాగంలో జిల్లా మొదటి బహుమతిని సాధించి డీఈఓ చేతుల మీదుగా నగదును అందుకున్నాడని తెలిపారు. శనివారం పాఠశాల వద్ద విద్యార్థికి నగదు బహుమతిని అందించి అభినందించినట్లు తెలిపారు.

శాస్త్రీయ విద్యను అలవర్చుకోవాలి

వనపర్తిటౌన్: శాస్త్రీయ విద్యను అలవర్చుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ శ్రీధర్ అన్నారు. బ్లాసమ్స్ ప్లే వే పాఠశాలలో శనివారం నిర్వహించిన విజ్ఞాన శాస్త్ర ప్రదర్శనకు ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రదర్శనలను తిలకిస్తూ ఆయన మాట్లాడారు.. ఆధునిక కాలంలో విద్యార్థులు చురుగ్గా ఉండాలని, సాంకేతికత వైపు మొగ్గు ఉండాలి తప్పితే ఎక్కువ ఫోన్, ల్యాప్‌ట్యాప్‌లతో గడపవద్దని సూచించారు. విద్యార్థులు శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని అందిపుచ్చుకొని సమాజంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తిరుమల్, కురుమయ్య, రఘునాథ్‌రెడ్డి, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలను తిలకిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్

వైభవంగా చండీహోమం

జడ్చర్ల టౌన్: మండలంలోని దేవునిగుట్టతండా పంచాయతీ వద్ద ఉన్న శ్రీగిరిక్షేత్రం అష్టలక్ష్మి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకుని శనివారం లోకకల్యాణార్థం చండీహోమం నిర్వహించారు. ఈ మేరకు ఆచార్య కృష్ణస్వామి నేతృత్వంలో అమ్మవారికి కుంకుమార్చన, పంచామృతాభిషేకం జరిపించి హోమం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

చట్టాలు అందరికీ సమానం

అయిజ: చట్టాలు అందరికీ సమానమేనని, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి గంటా కవిత అన్నారు. శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ.. చట్టం దృష్టిలో పేద, ధనిక తేడా ఉండదన్నారు. చట్టాలపై అవగాహన లేక కొందరు అనేక విధాలుగా నష్టపోతున్నారని, కోర్టులచుట్టూ తిరుగుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కోర్టులు ఉన్నాయని, చట్టాన్ని చేతిలోకి తీసుకొని నేరస్తులు కాకుండా న్యాయస్థానంలో న్యాయం పొందాలన్నారు. పేదవారికి ఫీజు లేకుండా వాదించేందుకు, న్యాయపరమైన సలహాలు ఇవ్వడానికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, న్యాయవాదులు మధుసూదన్‌బాబు, మధుకుమార్, జనార్దన్‌రెడ్డి, రవి శంకర్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు' సద్వినియోగం చేసుకోండి



కోతులకుంటతండాలో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న డాక్టర్ రాజ్యలక్ష్మీ

ఖిల్లాఘనపురం: కంటివెలుగు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కంటి వైద్యనిపుణులు రాజ్యలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని కోతులకుంటతండా లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మంచి ఉద్దేశంతో ఈ పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు, కంటి అద్దాలు అందిస్తామన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. కోతులకుంటతండా కేంద్రంలో 131 మందికి పరీక్షలు చేయగా, 11 మందికి అద్దాలు పంపిణి చేయగా, ఇద్దరికి కంటి ఆపరేషన్ అవసరమని తెలిపారు.

కంటి వెలుగుపై ఇంటింటి ప్రచారం..

అమరచింత: కంటివెలుగు కార్యక్రమంలో 18ఏళ్ల దాటిన ప్రతి ఒక్కరూ శిబిరాలకు వచ్చి పరీక్షలు చేసుకోవాలని సింగంపేట గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడంతో హెల్త్ సూపర్‌వైజర్ సురేంధర్‌గౌడ్ ఆధ్వర్యంలో కరపత్రాలను ఇస్తు అవగాహన కల్పించారు.

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండవ విడత కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దమందడి ఎస్‌ఐ హరిప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని వెల్టూర్‌లో ఏర్పాటు చేసిన కంటివెలుగు కార్యక్రమాన్ని ఎస్‌ఐ పరిశీలించారు. పరీక్ష కేంద్రం దగ్గర ప్రజలు ఓపికతో ఉండి సిబ్బందికి సహకరించాలని సూచించారు. అనంతరం ఎస్‌ఐ కంటి పరీక్షలు చేయించుకున్నారు.

దోపిడీ లేని సమాజమే లెనిన్ లక్ష్యం

గద్వాల అర్బన్: దోపిడీ లేని సమాజ నిర్మాణమే లెనిన్ లక్ష్యమని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కృష్ణ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో లెనిన్ 99వ వర్ధంతిని పురస్కరించుకొని చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి కార్తీక్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీమ్‌పాష, జమ్మన్న, శాంతన్న పాల్గొన్నారు.



బూత్ కమిటీలు పూర్తి చేయండి

వనపర్తి క్రైం: జిల్లా కేంద్రంలోని అన్ని పోలింగ్ బూత్ కమిటీలను ఈనెల 30వరకు పూర్తి చేయాలని బీజేపీ అసెంబ్లీ పాలక్ వేణుగోపాల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ బూత్ లెవల్ సమావేశాన్ని నిర్వహించారు. 22మంది కార్యకర్తలతో బూత్ కమిటీలను పూర్తి చేయాలని, కమిటీలో తప్పనిసరిగా ఎస్సీ, ఎస్టీ, మహిళా సభ్యులు, సోషల్ మీడియా సభ్యులను నియమించాల్సి ఉంటుందన్నారు. 33 వార్డుల్లో బూత్ కమిటీలను పూర్తి చేయాలని సూచించారు. సీఎం కేసిఆర్ అసెంబ్లీ రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని, అందుకు కార్యకర్తలు సిద్ధం కావాలన్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో పార్టీ విజయకేతనం ఎగరవేస్తూ వస్తుందని, రాష్ట్రంలో రాబోయే ఎన్నికల్లో విజయం సాధించాలంటే బూత్ కమిటీలే ముఖ్య భూమిక పోషించనున్నాయని, ఆ దిశగా కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ప్రతాప్, సబ్బిరెడ్డి, కృష్ణ, కుమారస్వామి, కృష్ణయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్దిరాజు, రామ్మోహన్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న వేణుగోపాల్

రేపు విద్యుత్ సమస్యలపై వినతుల స్వీకరణ

పెబ్బేరు: పట్టణ కేంద్రంతో పాటు మండలంలోని విద్యుత్ సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు, వినియోగదారులు వాటి పరిష్కారం కోసం వినతులు సోమవారం స్వీకరిస్తున్నట్లు ఎస్‌ఈ నరేందర్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రిసిటీ, రెగ్యులేటరీ కమిషన్ (ఈఆర్‌సీ) నుంచి 20 మంది అధికారుల బృందంతో పట్టణంలోని వల్లపురెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమస్యలను రైతులు, వినియోగదారులు అధికారులు దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని కోరారు.

ఘనంగా వేణుగోపాల స్వామి ఊరేగింపు

పెబ్బేరు: పట్టణంలోని చౌడేశ్వరిదేవి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం వేణుగోపాలస్వామి ఆలయం నుంచి స్వామి వారిని ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. యాదవ కులస్తులు, పట్టణ ప్రజలు, కుర్వడోళ్ల, భజంత్రీలతో స్వామివారిని వీధుల్లో ఊరేగించారు. పట్టణంలోని వీధుల్లో భక్తులు స్వామివారికి పూజలు చేస్తూ తాము కోరుకున్న కోరికలు తీర్చాలని వేడుకున్నారు.

సగరుల సంక్షేమానికి కృషి

వనపర్తి క్రైం: సగరుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో సగర సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు తిరుపతయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి, సత్యంసాగర్, విష్ణుసాగర్, సత్యనారాయణ, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

దేవరకద్ర: చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచించారు. శనివారం దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని వీరప్పయ్యస్వామి దేవస్థానం గ్రౌండ్‌లో దేవరకద్ర ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నపూర్ణ, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జట్టి నర్సింహారెడ్డి, నాయకులు వెంకటేశ్, శ్రీకాంత్‌యాదవ్, కొండ శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, శివానంద్, బాల్‌రాజు, చల్మారెడ్డి, రంగయ్యగౌడ్, వెంకట్రాములు, ఆంజనేయులు, శంకర్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం



అమరచింత: ధర్మాపురంలో సీసీ రోడ్డు పనులకు శనివారం మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు ప్రారంభించారు. జిల్లా పర్యటకు వచ్చిన సీఎం కేసీఆర్ జిల్లాలోని ఒక్కో పంచాయతీకి రూ.20 లక్షల నిధులు అందించారు. దీంతో ధర్మాపురంలో అంతర్గతంగా సీసీ రహదారులు వేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గోపిరెడ్డి, షానవాజ్‌ఖాన్, వెంకటయ్య పలువురు పాల్గొన్నారు.

ఒరిగిన చెరుకు ట్రాక్టర్



ఆత్మకూర్: పట్టణంలో చెరుకులోడ్‌తో ఉన్న ట్రాక్టర్ ఒక్కసారిగా ఒరిగిపోయింది. శనివారం ఆత్మకూర్ మీదుగా కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీకి వెళ్తున్న ట్రాక్టర్ గాంధీచౌక్ సమీపంలో ఒరిగిపోయింది. ఆ సమయంలో పక్క నుంచి వాహనదారులు ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదమే తప్పింది. రోడ్డు మధ్య నుంచి డివైడర్ పనులు చేస్తుండడంతో ఇరుకుగా మారడంతోనే ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు చెబుతున్నారు. జేసీబీ ద్వారా ట్రాక్టర్‌ను మున్సిపాలిటీ సిబ్బంది పక్కకు తరలించి ఇబ్బంది లేకుండా చేశారు.

త్రోబాల్ ఫెడరేషన్ కప్ పోటీలకు ఎంపిక



మహబూబ్‌నగర్ క్రీడలు: ఒరిస్సాలోని పూరిలో ఈనెల 23 నుంచి 25 వరకు జరిగే 34వ త్రోబాల్ ఫెడరేషన్ కప్ (జాతీయస్థాయి) పోటీలకు జిల్లాలోని భూత్పూర్‌కు చెందిన చెన్న కేశవులు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శనివారం స్థానిక మహబూబ్‌నగర్ గ్రామర్ స్కూల్‌లో జిల్లా త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను సన్మానం చేసి టీ షర్టు అందజేశారు. కార్యక్రమంలో గ్రామర్ స్కూల్ ప్రిన్సిపాల్ శాంత, జిల్లా త్రోబాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సాదత్‌ఖాన్, అహ్మద్ హుస్సేన్, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ జియావుద్దీన్, త్రోబాల్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి రంజిత్‌కుమార్ పాల్గొన్నారు.

బీఎస్పీ యాత్రను విజయవంతం చేయాలి

ఎర్రవల్లిచౌరస్తా: బీఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టే బహుజన రాజ్యాధికార యాత్రను విజయవంతం చేయాలని నాయకుడు రాంబాబు అన్నారు. శనివారం ఇటిక్యాల మండలంలోని ధర్మవరం, బీచీపల్లిలో పర్యటించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ అలంపూర్ నియోజకవర్గంలో చేపట్టే యాత్రలో ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలను తెలిపి యాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.